## గుర్తింపు కార్డులతో సమన్యాయం



ఇంటింటి సర్వేలో మండల అధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు, అక్టోబర్ 3: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించుటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు తయారు చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీలోని విఠాయిపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ గోపీరామ్ పాల్గొని రాష్ట్రంలో అత్యుత్తమ విధానంలో సర్వే నిర్వహించి డిజిటల్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం రాంనుంతల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన మంచినీటి సహాయకుల శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆర్థిక హోదాలతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ గుర్తింపు కార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, మండల నాయకులు పాల్గొన్నారు.

## కమిషనర్‌పై ఎమ్మెల్యే గరం గరం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 3: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డిపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించకపోతే అధికారులు ఇంకెందుకని మండిపడ్డారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని స్పష్టంచేశారు. అక్రమంగా నిర్మిస్తున్న షెడ్ల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు విన్నవించగా.. అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. గురువారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోనీ జేవ్యాలీలో పలు కాలనీల ప్రతినిధులతో రంగారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ... రూ.6 కోట్ల నిధులతో తట్టిఅన్నారంతోపాటు చుట్టుపక్కల కాలనీలకు ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతామని చెప్పారు. గతంలోని టెండర్లు క్యాన్సిల్ చేసి, త్వరలో కొత్త టెండర్లు పిలువాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో అధికారుల తీరుపై గరమయ్యారు. వీధి లైట్లు వెలిగేలా చూడాలన్నారు. పలు కాలనీల్లో తాగు నీటి సమస్య సైతం ఉన్నదని, సమస్య తీర్చాలని సూచించారు. నల్లా కనెక్షన్లకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, మున్సిపల్, ఇరిగేషన్, వాటర్‌వర్క్స్ తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆదిబట్లలో పేద మహిళకు ఇల్లు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిబట్ల, అక్టోబర్3: నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డును అందజేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం ఆదిబట్లలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పైలట్ ప్రాజెక్ట్ కింద ఆదిబట్ల మున్సిపాలిటీలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేసిందని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు పథకాలను పూర్తిగా అమలు చేస్తామని అన్నారు. ఇప్పుడు ఇల్లులేని ప్రతి కుటుంబానికి ఇల్లు, రేషన్ కార్డు అందించడానికి సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికకు ఈ కార్డు ప్రామాణికంగా భావించడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఇల్లులేని ప్రతి కుటుంబానికి ఇల్లు అందించడానికి 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ ఇంటి స్థలాలు ఇచ్చేలా కృషి చేస్తానని అన్నారు. మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిర్మిస్తున్న సంయుక్త మార్కెట్ ను ప్రభుత్వం చేపడుతున్న స్కిల్ యూనివర్సిటీగా లేదంటే గ్రామానికి కల్యాణమండపం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేకు ఆదిబట్ల మున్సిపాలిటీని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, ఉప్పరిగూడ సొసైటీ చైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, గురునాథ్ రెడ్డి, శివకుమార్, వెంకటేశ్వర్లు, పాండురంగారెడ్డి, రజినీకాంత్‌గౌడ్, ఏఈ వీరాంజనేయులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 3 : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మల్కాపూర్ గేట్ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర, విద్యా సదస్సు, చేవెళ్ల శాసనసభ నియోజకవర్గ ఉపాధ్యాయ, అధ్యాపకుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక భూమిక అని, అలాంటి ఉపాధ్యాయులను గౌరవించుకోవాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోచన్న, ఉపాధ్యాయులు ఆశీర్వాదం, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు హన్మంత్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

యాచారం, అక్టోబర్ 3: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు లోహిత్‌రెడ్డి తండ్రి కుందవరం రఘుమారెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గురువారం రఘుమారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాషా, తక్కళ్లపల్లితండా మాజీ సర్పంచ్ రమావత్ జగదీశ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్యగౌడ్, శంకర్‌నాయక్, గుండాలు ఉన్నారు.

## నేడు చేవెళ్లకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి రాక

చేవెళ్లటౌన్/చేవెళ్ల రూరల్, అక్టోబర్ 3: నేడు చేవెళ్లలో నిర్వహించే దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరవుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండల కేంద్రంలోని పట్లోళ్ల ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించి, కౌకుంట్లలోని పట్లోళ్ల ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి ఉచిత శిక్షణా తరగతులు

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 3: యోగా, ధ్యానం, స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు ఉచితంగా శిక్షణా తరగతులను ప్రగతి వెల్ఫేర్ సొసైటీ బూర్గుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఫరూఖ్‌నగర్ మండలంలోని విఠ్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. నేటి నుంచి ఈ నెల 9 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8, 9వ తరగతి చదువుతున్న వైష్ణవి, శ్రావణి ఈ రెసిడెన్సియల్ శిక్షణా కార్యక్రమంలో హాజరవుతున్నట్లు తెలిపారు.

## విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి



కడ్తాల్, అక్టోబర్ 3: మండల కేంద్రం సమీపం గుండా వెళ్తున్న హై టెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో పవర్ గ్రిడ్ డీజీఎం సంతోశ్‌ను, గురువారం కడ్తాల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు మాట్లాడుతూ కడ్తాల్ రెవెన్యూ పరిధిలో 790/24 నుంచి 126 సర్వే నెంబర్లలో గల భూముల్లో, 765 కేవీ హై టెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్ పోల్ కోసం సర్వే మార్కింగ్ చేపట్టారని తెలిపారు. సంబంధిత అధికారులు సేకరించిన భూములు అధికంగా చిన్న, సన్నకారు రైతులవేనని పేర్కొన్నారు. తమ భూముల్లో, హై టెన్షన్‌కు సంబంధించిన పోల్స్ ఏర్పాటు చేస్తే ఎలా బతకాలి అని ప్రశ్నించారు. అధికారులు వెంటనే హై టెన్షన్ పోల్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. లేకపోతే అధికారులు చేపడుతున్న పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతులు రాములు, అభిషేక్‌రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, అంజయ్య, తిరుపతిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పాండు, జంగారెడ్డి, రాజేశ్, రవి, సాయికిరణ్, వెంకట్రాములుగౌడ్, శివ, సేవ్యానాయక్, చెన్నయ్య, మహేశ్, సుదర్శన్, శ్రీకాంత్, కుమార్, మల్లేశ్, చీఫ్ ఇంజినీర్‌గణేశ్, ఇంజినీర్ గోపాల్ పాల్గొన్నారు.

## పాల బిల్లులు వెంటనే చెల్లించాలి



కడ్తాల్, అక్టోబర్ 3: పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు వెంటనే చెల్లించాలని, వివిధ గ్రామాలకు చెందిన విజయ పాల సొసైటీ అధ్యక్షులు చేగూరి వెంకటేశ్, సభావట్ బిచ్చానాయక్, విస్లావత్ రామచందర్‌నాయక్, విస్లావత్ జగన్‌నాయక్ కోరారు. హైదరాబాద్‌లోని లాలాపేట్‌లోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో, ఇటీవల నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గుత్తా అమిత్‌రెడ్డిని గురువారం సాయంత్రం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల బిల్లులు వెంటనే విడుదల చేసి పాడి రైతుల సమస్యలను తీర్చాలని పేర్కొన్నారు. కడ్తాల్ పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రానికి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు, ఖాళీ స్థలంలో మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరినట్లు వారు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీ కార్డుపై వైద్యం అందించాలి

తుర్కయాంజాల్, అక్టోబర్ 3 : తెలంగాణ ప్రభుత్వంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం దక్కడంలేదని అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్‌గౌడ్ అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సంపూర్ణమైన ఆరోగ్యం అందించాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కానీ నేడు ప్రైవేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అడ్మిట్ చేసుకోకుండా ప్రథమ చికిత్స కూడా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. మారుమూల గ్రామాల్లో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా కూడా మా వద్ద బెడ్స్ లేవు, ఐసీయూలో ఖాళీగా లేవని సమాధానం చెప్పడం సరైందికాదన్నారు. ప్రజా పాలన పేరుతో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## మున్సిపల్ సిబ్బందికి సన్మానం



ఆమనగల్లు, అక్టోబర్ 3: గడిచిన గణేశ్ నిమజ్జన సందర్భంగా సేవలందించిన మున్సిపల్ సిబ్బందికి గురువారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల ఎస్‌ఐ వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ యాదయ్య, పోలీస్ సిబ్బంది రజినీకాంత్, మున్సిపల్ సిబ్బంది చిన్న, రవి, సుధాకర్, గోపి, చిట్టి, సురేశ్, విజయ్, ప్రశాంత్ ఉన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



నందిగామ, అక్టోబర్ 3: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. మండలంలోని మోత్కులగూడ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలత్రిపురాసుందరీదేవిగా అమ్మవారు



షాద్‌నగర్‌లోని దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఆలయాలు, మండపాల్లో గురువారం కొలువుదీరిన దుర్గామాత మొదటి రోజు బాలత్రిపురాసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. దేవాలయాల ప్రాంగణంలో మహిళలు కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొన్నది.

-న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ





ఆమనగల్లు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో



కడ్తాల్: మైసిగండిలో ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మ వారు



కడ్తాల్: కడ్తాల్ పట్టణంలో బాలత్రిపురాసుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



యాచారం : నందివనపర్తిలో బాలత్రిపురాసుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

## 5న చలో కామారెడ్డి

షాబాద్, అక్టోబర్ 3 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్ డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 5వ తేదీన కామారెడ్డిలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ రైతాంగ డిక్లరేషన్ ప్రకటించిందని, దానిని ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు పెట్టి రైతాంగాన్ని మోసం చేసిందని ఆరోపించారు. రైతుభరోసా ద్వారా కౌలు రైతులకు రూ.15వేలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఇస్తామన్న రూ.12వేల సంగతి ప్రభుత్వం మరిచిపోయిందని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తామన్న హామీ తుంగలో తొక్కినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూతపడ్డ చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. పంటల బీమా పథకం అమలులోకి రాక గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రైతాంగం తీవ్ర నష్టం చవిచూసిన్నట్లు వాపోయారు. భూమిలేని రైతులు కూలీలకు వర్తింపజేస్తామన్న బీమాను వెంటనే అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెడతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. వన్యప్రాణులతో పంటలు నష్టపోయి రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నదన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ద్వారా రైతులకు ఉపయోగపడేలా ప్రతి ఎకరాకు నష్టపరిహారం ఇవ్వాలని చెప్పారు. ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా పంటలకు లాభసాటి ధర ఇస్తే రైతాంగం స్వతంత్రులవుతారని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుమందుల పైన ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల ప్రక్రియ అసంబద్ధంగా ఉందని, దేశంలో ఉత్పాదకత పెరిగిన పంటలను దిగుమతి చేసుకొని రైతుల నడ్డి విరుస్తున్నారని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో విజయ డెయిరీ పాల రైతులు అగమ్య గోచర స్థితిని ఎదుర్కొంటున్నారని, వారికి ఐదు నెలలుగా పాల సేకరణలో ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదని, వెంటనే పాల డబ్బులను రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వీరేశం, చంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి



మొయినాబాద్, అక్టోబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు వరంగల్‌లో చేపట్టిన రైతు డిక్లరేషన్‌లో రైతులకు సుమారుగా 11 హామీల వరకు ఇచ్చారని, వాటిలో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. ఈ నెల 5వ తేదీన వరంగల్ జిల్లాలో చేపట్టే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం రూ. 33 వేల కోట్లు రుణమాఫీలు చేయాల్సి ఉందని చెప్పినప్పటికీ, 50 శాతం కూడా రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు భారతీయ కిసాన్ సంఘ్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుధాకర్‌రెడ్డి, శంకర్, కృష్ణ, నాయకులు శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను సాధించాలి



ఆమనగల్లు, అక్టోబర్ 3: ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేందర్, యాదయ్య, కృష్ణయ్య, చంద్రమౌళి, యాదయ్య, జహంగీర్, అశోక్, సాలయ్య, పర్వతాలు, లక్ష్మయ్య, జంగయ పాల్గొన్నారు.

## డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదిబట్ల, అక్టోబర్ 3: గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని ఆదిబట్ల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ ముంబయి మహారాష్ట్రకు చెందిన రోమీ భరత్ కళ్యాణ్ గత కొంత కాలంగా గంజాయి తీసుకువచ్చి అమ్మేవాడు. అదేమాదిరిగా కేరళకు చెందిన టోబి నుంచి బెంగళూరు సమీపంలో కొనుగోలు చేసి అమ్ముకునేవాడని తెలిపారు. గతంలో ఇతడిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇతను గురువారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ సమీపంలోని బొంగుళూరు గేట్ వద్ద సర్వీస్ రోడ్డు మీదుగా తుక్కుగూడ వైపు నడుచుకుంటూ వెళుతున్న రోమీ భరత్ కళ్యాణ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న సంచిలో తనిఖీ చేయగా అందులో కేజీన్నర గంజాయి, 50 గ్రాముల బ్యాంకాక్ గంజాయి లభించిందని అన్నారు. ఈ గంజాయిని కళ్యాణ్ బెంగళూరు నుంచి తీసుకువచ్చి కొంగరకలాన్, ఆదిబట్ల ఏరియాల్లో ఉన్న లేబర్‌కు అమ్ముతుండేవాడని తెలిపారు. గంజాయి తరలిస్తున్న అతడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# మేం నివాసం ఉంటున్న ఇండ్లను వదలం

- రాజేంద్రనగర్, గండిపేట పరిధిలో 332 ఇండ్ల గుర్తింపు
- బాధితులకు నచ్చజేప్పే ప్రయత్నంలో అధికారులు
- ఆర్డీవో కార్యాలయంలో డబుల్ బెడ్‌రూంల పట్టాల పంపిణీ

బండ్లగూడ, అక్టోబర్ 3 : తాము ఉన్న ఇండ్లను వదిలి వెళ్లే ప్రశక్తే లేదని తేగేసి చెబుతున్నా అధికారులు మాత్రం తమదైన స్థాయిలో బాధితులకు నచ్చజెప్పి ఇండ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో హైడ్రా పేరుతో చెరువులు, కుంటలతో పాటు మూసీ రివర్‌బెడ్ ప్రాంతాల్లో కబ్జాలు చేసి ఇండ్లను నిర్మించుకుని ఉన్న ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతలు చేపడుతున్నారు. రాజేంద్రనగర్, గండిపేట మండలం పరిధిలోని జియాగూడ, కార్వాన్, లంగర్ హౌస్, అత్తాపూర్, కిస్మత్‌పూర్, మంచిరేవుల, నార్సింగి, రాందేవ్‌గూడ, హైదర్‌షాకోట్, గంధంగూడ, గండిపేట, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో మొత్తం మూసీ రివర్‌బెడ్ ప్రాంతాల్లో 332 ఇండ్లను అధికారులు గుర్తించారు. కాగా వాటిని కూల్చేందుకు వెళ్లగా తమ నివాసం ఉంటున్న ఇండ్లను వదిలి పోలేమని అధికారులపై తిరుగబడుతున్నారు. దీంతో వారికి నచ్చజెప్పే బాటలోకి అధికారులు దిగారు. ఇందుకు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారికి ప్రాంతాలను కేటాయించారు. ఇండ్లు కోల్పోయిన బాధితులకు రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 22 మంది బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. చేసేదేమీ లేక ప్రజలు ఇచ్చిన పట్టాలను చేత పట్టుకుని ఇండ్లకు వెళ్తున్నారు.



ఇండ్లను కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తున్న అధికారులు

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

బండ్లగూడ : జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెస్టన్ కాలనీలో గురువారం కార్పొరేటర్ రావులకోళ్ల మాలతీనాగరాజు డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉం టూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేఎంసీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు, కాలనీ అధ్యక్షుడు శాంతికుమార్ పాల్గొన్నారు.